ఆగిపోయిన 'తోపుడు బండి'

- గుండెపోటుతో తోపుడు బండి సాదిక్ మృతి
- ఫౌండేషన్‌తో వేలాది మంది విద్యార్థులకు చేయూత
- సాదిక్ మృతికి ప్రముఖుల సంతాపం

హైదరాబాద్, నవంబర్ 7(నమస్తే తెలంగాణ): తోపుడు బండి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సాదిక్ మృతి చెందారు. బుధవారం రాత్రి ఆయనకు గుండెపోటు రావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున సాదిక్ తుది శ్వాస విడిచారు. పార్థివదేహాన్ని ఆయన స్వగ్రామం ఖమ్మం జిల్లా కల్లూరుకు తరలించారు. విద్యార్థులు, స్నేహితులు, బంధువుల సందర్శనార్థం మధ్యాహ్నం 2గంటల వరకు కల్లూరు ఉంచి, సాయంత్రం 4గంటలకు సత్తుపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. సాదిక్ మృతి పట్ల ప్రముఖులు సంతాపం వ్యక్తంచేశారు.

పేద పిల్లలకు బాసట

ఓయూలో ఎంఏ తెలుగు చదివిన సాదిక్.. కొన్నాళ్లపాటు ప్రముఖ పత్రికల్లో జర్నలిస్టుగా సేవలందించారు. ఆ తర్వాత రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టి వచ్చిన ఆదాయంతో పుస్తకాలను కొనేవారు. తోపుడు బండి ద్వారా వంద రోజుల్లో వెయ్యి కిలోమీటర్లు తిరిగి గ్రామాల్లో పుస్తకాలను పంచిపెట్టారు. ఆయన సేవా గుణానికి ఆకర్షితులైన కొంత మంది స్నేహితులు పుస్తకాలు కొనుగోలు చేసేందుకు సహకరించారు. అనంతరం పేద పిల్లలకు సాయం చేసేందుకు తోపుడు బండి ఫౌండేషన్‌ను స్థాపించారు. ఫౌండేషన్ ద్వారా విరాళాలు సేకరించి వేలాది మంది పేద పిల్లలకు ఉచితంగా పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్, పాఠశాలలకు ఫర్నిచర్ సమకూర్చారు. దాతల సాయంతో అనాథ పిల్లలకు చేయూతనిచ్చారు. సాదిక్ భార్య ఉష వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. సాదిక్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల్లోనూ ఉష పాలుపంచుకుంటున్నారు.

సాదిక్ మృతి బాధాకరం : హరీశ్‌రావు

హైదరాబాద్, నవంబర్ 7(నమస్తే తెలంగాణ): జర్నలిస్టుగా, సంఘ సేవకుడిగా విశిష్ట సేవలందించి..తోపుడు బండితో పుస్తకప్రియులకు సుపరిచితుడైన సాదిక్ మృతి బాధాకరమని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. గురువారం ఎక్స్ వేదికగా సాదిక్ సేవలను ట్వీట్ చేశారు. పిల్లల్లో పుస్తక పఠనాసక్తిని పెంపొందించేందుకు తోపుడు బండిలో పుస్తకాలు పెట్టుకొని తిరగడం గొప్ప విషయమని కొనియాడారు. ఆయన సేవలు ప్రజల మనస్సులో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ఆకాంక్షించారు. సాదిక్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

అసెంబ్లీ కార్యదర్శికి ఆ అధికారం లేదు

- ఫిరాయింపుల కేసులో అప్పీల్ పిటిషన్ చెల్లదు
- స్పీకర్ నిర్ణయం తీసుకోకుండా ఉంటే ఏం చేయాలి?
- కోర్టులకు జోక్యం చేసుకునే అధికారం ఉంది
- తక్షణమే ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు వేయాలి
- హైకోర్టులో బీఆర్‌ఎస్ తరపున వాడివేడి వాదనలు
- సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యం అవసరం లేదన్న గండ్ర
- విచారణ నేటికి వాయిదా



హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై పిటిషన్ల విచారణ షెడ్యూల్‌ను ఖరారు చేయడంతోపాటు ఫిరాయింపు ఎమ్మెల్యేలపై ఫిర్యాదులు చేసిన పిటిషనర్ల ఫైళ్లను స్పీకర్ ముందుంచాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును అసెంబ్లీ కార్యదర్శి సవాల్ చేయడం చెల్లదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల తరపున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఎదుట వాదించారు. స్పీకర్ ముందు ఫైళ్లు ఉంచాలనే ఆదేశాలను అమలు చేయాల్సిన అసెంబ్లీ కార్యదర్శికి ఆ తీర్పును సవాల్ చేసే అధికారం, స్థాయి లేదని చెప్పారు. ప్రజల డబ్బుతో విధులు నిర్వర్తిస్తున్న అధికారికి కోర్టు తీర్పును సవాలు చేసే అధికారం ఉండదని పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలనే పిటిషన్ల విచారణ షెడ్యూల్‌ను ఖరారు చేయాల్సింది స్పీకరేనని గుర్తుచేశారు. స్పీకర్ తన ముందున్న కోర్టు ఉత్తర్వులను అమలు చేయడమో, లేదో తేల్చుకోవాలని, కానీ, వాటిని అసెంబ్లీ కార్యదర్శి సవాల్ చేయడం చట్ట వ్యతిరేకమని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ తరపున గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పిటిషన్ వేయగా, మరో ఫిరాయింపు ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పిటిషన్ వేశారు. అదేవిధంగా దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించినా స్పీకర్ సమయం ఇవ్వడం లేదంటూ శాసనసభలో బీజేపీ పక్ష నేత మహేశ్వర్ రెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపుల పిటిషన్ల విచారణ షెడ్యూల్‌ను నాలుగు వారాల్లోగా ఖరారు చేయాలని సెప్టెంబర్ 9న సింగిల్ జడ్జి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి తీర్పు చెప్పారు. ఈ తీర్పును సవాలు చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి వీ నరసింహాచార్యులు వేర్వేరుగా దాఖలు చేసిన రెండు అప్పీల్ పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం కూడా విచారణ కొనసాగించింది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల తరపున గండ్ర మోహన్‌రావు వాదనలు కొనసాగిస్తూ.. అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌లో ఫిరాయింపుదారులను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలని పేర్కొన్నారని చెప్పారు. ప్రజల డబ్బుతో జీతభత్యాలు తీసుకునే అధికారికి సంబంధం లేని పార్టీ ఫిరాయింపుల కేసులో అప్పీల్ దాఖలు చేసే అధికారం లేదని పేర్కొన్నారు. స్పీకర్ తన ముందున్న ఫిరాయింపు పిటిషన్లపై విచారణ షెడ్యూల్‌ను వెల్లడించాలని మాత్రమే సింగిల్ జడ్జి ఆదేశించారని, ఆ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

అనర్హత వేటు వేయాలన్న వాదన చట్టబద్ధం

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే క్రమంలో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలన్న పిటిషనర్ల వాదన చట్టబద్ధమేనని గండ్ర మోహన్‌రావు చెప్పారు. 'కైశమ్ మేఘచంద్రసింగ్ వర్సెస్ స్పీకర్ ఆఫ్ మణిపూర్' కేసులో అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్ణీత గడువులోపు నిర్ణయం తీసుకోవాలని చెప్పిన విషయాన్ని పరిగణనలోకి తీసుకుని సింగిల్ జడ్జి ఆ విధమైన ఉత్తర్వులు జారీచేశారని తెలిపారు. శాసనసభ కాలపరిమితి పూర్తయ్యే ఐదేండ్ల వరకు స్పీకర్ వేచిచూస్తూ ఉంటే, పిటిషనర్లు కోర్టుల ద్వారా న్యాయం ఆశించడం ఒక్కటే మిగిలిన మార్గమని వివరించారు. 'కిహోటో హోలోహన్' కేసును ప్రస్తావిస్తూ.. అనర్హత పిటిషన్లలో నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్ నిరాకరిస్తే పిటిషనర్‌కు ఎటువంటి పరిష్కారం లభించదని చెప్పారు. కైశమ్ మేఘచంద్రసింగ్ కేసులో సుప్రీంకోర్టు చెప్పిన తీర్పు ప్రకారం కూడా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలనే పిటిషన్లను స్పీకర్ విచారణ పూర్తి చేసి నిర్దిష్ట సమయంలో తగిన నిర్ణయాన్ని వెలువరించాలని పేర్కొన్నారు. మూడు నెలల గడువులోగా స్పీకర్ తన ముందున్న పిటిషన్లను పరిష్కరించాలని చెప్పారు. స్పీకర్‌కు ఫిర్యాదు చేయడానికి వెళ్తే అవకాశం ఇవ్వలేదని, స్పీకర్ కార్యాలయం కూడా తమ పిటిషన్లు తీసుకోలేదని, వివరించారు. రిజిస్టర్డ్ పోస్టులో పిటిషన్ పంపితే వాపస్ వచ్చిందని, చివరికి హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేయాల్సి వచ్చిందని తెలిపారు. కోర్టు ఆదేశాల తర్వాత పిటిషన్లు స్పీకర్ వద్దకు చేరాయని, నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు స్పీకర్ ఏ నిర్ణయమూ తీసుకోలేదని చెప్పారు. ఈ పరిస్థితుల్లో సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యం వద్దని అన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం బలోపేతంగా ఉండాలంటే, భావితరాలకు స్ఫూర్తిదాయంగా ఉండాలంటే, ప్రజలిచ్చిన తీర్పు అపహాస్యం కాకుండా ఉండాలంటే ఫిరాయింపులకు పాల్పడిన వాళ్లు ఒక్కరోజు కూడా ఎమ్మెల్యేలుగా కొనసాగడానికి వీల్లేదని పేర్కొన్నారు. గతంలో స్పీకర్ అలా చేశారంటూ ఇప్పుడు చెప్పడం సమర్థనీయం కాదని, గతంలో తప్పు జరిగిందని చెప్పి అదే తప్పును కొనసాగించేందుకు ఆస్కారం ఇవ్వొద్దని హైకోర్టును కోరారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో ఒకరైన దానం నాగేందర్.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ పార్టీ తరపున సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి పోటీ చేశారని, ఈ దశలో కూడా స్పీకర్ ఏవిధమైన చర్యలు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా పరిగణించాలని కోరారు.

ప్రాథమిక దశలోనే కొట్టేయండి

బీఆర్‌ఎస్ తరపున ఎన్నికై కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ షెడ్యూల్‌ను నిర్ణయించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన అప్పీలు విచారణార్హం కాదని గండ్రా వాదించారు. విచారణ షెడ్యూలును నిర్ణయించడానికి పిటిషన్లను స్పీకర్ ముందుంచాలని కార్యదర్శికి ఆదేశాలున్నాయని, వీటిపై అప్పీలు దాఖలు చేసే అధికారం కార్యదర్శికి ఉండదని చెప్పారు. ఆ ఉత్తర్వులపై నిర్ణయం తీసుకోవాల్సింది స్పీకర్ అని, అభ్యంతరాలు ఉంటే స్పీకర్ అప్పీలు దాఖలు చేయాలిగానీ కార్యదర్శి కాదని స్పష్టంచేశారు. అంతేగాకుండా అప్పీలు దాఖలు చేయడానికి స్పీకర్ ఎలాంటి అనుమతి మంజూరు చేయలేదని, అందువల్ల అప్పీలు విచారణార్హం కాదని, ప్రాథమిక దశలోనే కొట్టివేయాలని కోరారు. తొలుత సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేయాలని ఎమ్మెల్యేల తరపు సీనియర్ న్యాయవాదులు దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి, మయూర్‌రెడ్డి వాదించారు. వాదనలు శుక్రవారం కొనసాగనున్నాయి.

ట్రిబ్యునల్ చైర్మన్‌కి ఇవ్వండి

హైకోర్టులో బీఆర్‌ఎస్ వాదనలు

పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో శాసనసభ స్పీకర్‌కు ఉత్తర్వులు జారీచేయాలని తాము కోరడం లేదని బీఆర్‌ఎస్ తరపున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు హైకోర్టులో వాదించారు. శాసనసభ వ్యవహారాల సభకు అధిపతి హోదాలో పార్టీ ఫిరాయింపుల పిటిషన్లపై స్పీకర్ విచారణ చేయబోరని గుర్తుచేశారు. పదో షెడ్యూల్ ప్రకారం స్పీకర్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా వ్యవహరిస్తారని, ట్రిబ్యునల్ అనేది న్యాయ వ్యవహారాల పరిధిలోకి వస్తుందని వివరించారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ మేరకు ట్రిబ్యునల్ చైర్మన్‌కి రాజ్యాంగ ధర్మాసనాలైన హైకోర్టు/సుప్రీంకోర్టు ఆదేశాలు/ఉత్తర్వులు/తీర్పులు ఇవ్వొచ్చునని చెప్పారు. ఈ క్రమంలో ట్రిబ్యునల్ చైర్మన్ హోదాలో విధులు నిర్వహించే స్పీకర్‌కు ఉత్తర్వులు ఇవ్వొచ్చునని, ఈ నేపథ్యంలో గతంలో సింగిల్ జడ్జి వెలువరించిన తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని గండ్ర ధర్మాసనం దృష్టికి తెచ్చారు.

ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఇన్‌చార్జి డీఈవో రవీందర్

ఏసీబీకి చిక్కిన పాలమూరు ఇన్‌చార్జి డీఈవో

రూ.50 వేలు లంచం తీసుకుంటూ దొరికిన అధికారి

మహబూబ్‌నగర్, నవంబర్ 7: మహబూబ్‌నగర్ ఇన్‌చార్జి డీఈవో రవీందర్ రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఈ మేరకు గురువారం ఏసీబీ ఏఎస్పీ కృష్ణగౌడ్ వివరాలు వెల్లడించారు. తనకంటే జూనియర్ అయిన ఉపాధ్యాయురాలికి స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ కల్పించారని మహబూబ్‌నగర్ జిల్లాలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలు డీఈవో రవీందర్ దృష్టికి తీసుకెళ్లింది. తాను ఏమీ చేయలేనని కోర్టుకెళ్లి అనుమతి తెచ్చుకోవాలని డీఈవో సూచించారు. దీంతో సదరు ఉపాధ్యాయురాలు కోర్టు నుంచి అనుమతి తెచ్చుకున్నది. అయినా.. కోర్టు ఆదేశాలను ధిక్కరించి ప్రమోషన్ కావాలంటే రూ.2 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముందుగా రూ.1.50 లక్షలను తీసుకొని ప్రమోషన్ ఇచ్చారు. న్యాయంగా తనకు రావాల్సిన ప్రమోషన్‌ను జూనియర్‌కు ఇవ్వడంతోపాటు కోర్టు నుంచి వచ్చిన ఉత్తర్వులను అమలు చేసేందుకు కూడా లంచం డిమాండ్ చేయడంతో ఆమె తన భర్తతో కలిసి ఏసీబీని ఆశ్రయించింది. మిగిలిన రూ.50 వేలను ఇచ్చేందుకు గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని శ్రీనివాసకాలనీలో డీఈవో ఇంటికి వెళ్లారు. లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డీఈవో, అతడి కుటుంబసభ్యులను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి డీఈవోను అడిషనల్ స్పెషల్ జడ్జి, ఏసీబీ కేసుల కోర్టు నాంపల్లి హైదరాబాద్‌కు తరలించినట్టు ఏసీబీ ఏఎస్పీ తెలిపారు.

యాదగిరిగుట్టను గొప్ప క్షేత్రంగా తీర్చిదిద్దుతాం

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, నవంబర్ 7(నమస్తేతెలంగాణ): యాదగిరిగుట్ట ఆలయాన్ని దేశంలోనే గొప్ప పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. దేశంలో ఎత్తయిన స్వర్ణగోపురం యాదగిరి నృసింహస్వామిదే కావడం తెలంగాణకు గర్వకారణమని కొనియాడారు. ఆలయ అభివృద్ధి, వైటీడీఏ ద్వారా చేపట్టిన పనుల పురోగతిపై సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం సమీక్షించనున్న నేపథ్యంలో గురువారం మంత్రి సురేఖ సచివాలయంలో అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు ఆలయ పనుల పురోగతిని మంత్రికి వివరించారు. ఇప్పటికే ఆలయం పరిసర ప్రాంతాల అభివృద్ధికి 1,241.36 ఎకరాలను సేకరించామని, మరో 101.10 ఎకరాల ఫైల్ కలెక్టర్ వద్ద పెండింగ్‌లో ఉన్నదని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఈ నెల 15 నుంచి విమాన గోపురానికి తాపడం పనులను ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు.

త్వరలో ఆటమ్‌బాంబు పేలబోతున్నది

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

వర్ధన్నపేట, నవంబర్ 7: త్వరలోనే ఆటమ్ బాంబు పేలబోతున్నదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. గురువారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండల కేంద్రంలో అమృత్ 2.0 పథకంలో భాగంగా రూ.33 కోట్ల అభివృద్ధి పనులను స్థానిక నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తాను ఇటీవల బాంబులు పేలబోతున్నాయని చెప్తే.. కొంతమంది తుస్సు బాంబులు, అవి ఎక్కడ పేలవని మాట్లాడారని, కానీ.. త్వరలోనే లక్ష్మీబాంబులు, నాటుబాంబులు కాకుండా ఆటమ్‌బాంబులు పేలనున్నాయని చెప్పారు. ప్రజాధనాన్ని ఎవరు దుర్వినియోగం చేసినా శిక్ష అనుభవించాల్సిందేనని స్పష్టంచేశారు. తల తాకట్టు పెట్టైనా డిసెంబర్ 31లోగా పంట రుణాలన్నీ మాఫీ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఉద్ఘాటించారు.

ఏపీలో చీకటి రోజులు

మాజీ సీఎం వైఎస్ జగన్

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): ఏపీలో ప్రస్తుతం చీకటి రోజులు నడుస్తున్నాయని వైఎస్సార్సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లిలోని కార్యాలయంలో గురువారం మీడియాతో ఆయన మాట్లాడారు. ప్రశ్నిస్తే ఈ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి, ఇబ్బందులకు గురిచేస్తున్నదని ఆరోపించారు. మహిళలపై దాడులు పెరిగాయని, లక్షన్నర లబ్ధిదారుల పింఛన్లు కట్ చేశారని ఆరోపించారు. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదని, డీజీపీ అధికార పార్టీ కార్యకర్త మాదిరిగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే జమిలి ఎన్నికలు అంటున్నారని, ఆ తర్వాత వచ్చేది తమ ప్రభుత్వమేనని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. తప్పుచేసిన అధికారులు ట్రాన్స్‌ఫర్, రిటైర్ అయినా దోషులుగా నిలబెడుతామని హెచ్చరించారు. పార్టీ కార్యకర్తలకు వైఎస్సార్సీపీ లీగల్‌సెల్ అండగా ఉంటుందని చెప్పారు. రెడ్‌బుక్ టీడీపీ నేతల వద్ద మాత్రమే కాదని, ప్రస్తుతం నష్టపోతున్న ప్రతి బాధితుడూ రెడ్‌బెక్ పెట్టుకుంటున్నాడని హెచ్చరించారు.

హైవేను వదిలి స్కైవేలో..

- నేడు సీఎం రేవంత్‌రెడ్డి మూసీ పాదయాత్ర
- హైవేపై కాదని హెలికాప్టర్‌లోనే ప్రయాణం
- ఎంపిక చేసిన రైతులతోనే మాట్లాడే అవకాశం
- రోడ్లపై రైతులు అడ్డం తిరుగుతారనే అనుమానం
- కాళేశ్వరం మీద కసితో ఆఖరి నిమిషంలో మిషన్ భగీరథ పైలాన్ ఆవిష్కరణ రద్దు

హైదరాబాద్, నవంబర్7 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి రోడ్డు మార్గాన్ని వదిలి, హెలికాప్టర్‌లో పాదయాత్రకు సిద్ధమయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం గ్రామం నుంచి పాదయాత్రగా బయలుదేరి భీమలింగం, ధర్మారెడ్డి కాల్వలను సందర్శించే విధంగా రూట్‌మ్యాప్‌ను రూపొందించారు. పాదయాత్ర మార్గమధ్యంలో ఆయనకు ఎవరెవరు వంగి దండాలు పెట్టాలి, మెడలో ఎవరు దండలు వేయాలి, హారతులు ఎవరు పట్టాలి, పార్టీ కార్యకర్తల గుంపులు ఎక్కడెక్కడ నిలబడి జై కొట్టాలి.. అనే అంశాలపై ముందస్తుగానే పకడ్బందీ ప్లాన్ చేశారు. ఎంపిక చేసిన రైతులు మాత్రమే ముఖ్యమంత్రితో మాట్లాడేందుకు వీలుగా సమావేశ స్థలాన్ని సిద్ధంచేసి పెట్టినట్టు తెలిసింది. రైతు సమావేశంలో సీఎంను ఏఏ ప్రశ్నలు అడగాలనే దాని మీద ఓ ఎంపీ సమక్షంలో ఇప్పటికే వారికి శిక్షణ ఇచ్చినట్టు తెలుస్తున్నది. పతిపక్షాల ఆరోపణలు తిప్పికొట్టడానికి మూసీ పరీవాహక ప్రాంతం వెంట పాదయాత్ర చేస్తానని తొలుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.

పాదయాత్ర కుదింపు

సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం తన పుట్టిన రోజును పురస్కరించుకొని అదేరోజున మూసీ ప్రాంతాల్లో పాదయాత్ర చేస్తానని తొలుత ప్రకటించారు. సంగెం గ్రామం నుంచి మూసీ పరీవాహక ప్రాంతంలో పాదయాత్ర చేస్తారని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అయితే మూడు రోజులు చేస్తానన్న పాదయాత్ర.. ప్రజా వ్యతిరేకత కారణంగా ఒక్కరోజుకే కుదించి మొక్కుబడిగా చేపడుతున్నట్టు అర్థమవుతున్నది. ఈ మేరకు శుక్రవారం ఉదయం సంగెం నుంచి మూసీ నది కుడి ఒడ్డు నుంచి యాత్ర ప్రారంభమై, భీమలింగం వరకు దాదాపు 2.5 కిలోమీటర్ల వరకే పాదయాత్ర కొనసాగుతుందని, అక్కడి నుంచి తిరిగి ధర్మారెడ్డిపల్లి కెనాల్ కట్ట వెంబడి నాగిరెడ్డిపల్లి రోడ్డు వరకు యాత్ర కొనసాగిస్తారని నిర్వాహకులు ప్రకటించారు.

రైతుబంధు రాలేదు.. నువ్వు రాకున్నా పర్లేదు

ముఖ్యమంత్రి రాకపై పోస్టర్లతో రైతుల నిరసన

వలిగొండ, నవంబర్ 7 : 'ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతుబంధు రాలేదు.. రుణమాఫీ కాలేదు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ ప్రక్షాళనకు రాకున్నా పర్వాలేదు' అంటూ రైతులు నిరసన తెలిపారు. 'మూసీతో మురిపించకు.. రుణమాఫీతో కరుణించు, రైతు బంధు రాలేదు.. నువ్వు రాకున్నా పర్లేదు' అని ముద్రించిన పోస్టర్లతో యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని సంగెం గ్రామానికి చెందిన రైతులు తమ వ్యవసాయ పొలాల్లో గురువారం నిరసన తెలిపారు.

తొలుత యాదగిరిగుట్టలో పూజలు

సీఎం రేవంత్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో శుక్రవారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని తన నివాసం నుంచి ఓఆర్‌ఆర్ మీదుగా వరంగల్ హైవేపై ప్రయాణించి ఉదయం 8.30లోపు దేవస్థానానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేయాలని అనుకున్నారు. కానీ ఆకస్మికంగా ఈరోడ్డు మార్గాన్ని రద్దుచేశారు. ఉదయం 10 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి యాదాద్రి ఆలయాన్ని చేరకుంటారని అధికారులు ప్రకటించారు. హైవేను వదిలి స్కైవేలో ప్రయాణించడానికి బలమైన కారణాలే ఉన్నట్టు తెలుస్తున్నది.

పసిగట్టిన ఇంటెలిజెన్స్ వర్గాలు!

సీఎం రోడ్డు మార్గంలో ప్రయాణిస్తే.. రైతులు, మూసీ, హైడ్రా బాధితులు అడ్డగించి నిరసనలు తెలిపే ప్రమాదం ఉన్నదని ఇంటెలిజెన్స్ వర్గాలు అనుమానించినట్టు తెలుస్తున్నది. ఇప్పటికీ రూ.2 లక్షల రుణమాఫీ కాని రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, మార్కెట్లతో ధాన్యం కొనుగోళ్లు కాక అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు సీఎం పాదయాత్ర నల్లగొండ వైపు మూసీ దిక్కు నుంచి కాకుండా హైదరాబాద్‌లో ఉన్న మూసీ వైపు పాదయాత్ర చేయాలని, బీఆర్‌ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. కొంపగూడు కోల్పోయిన బాధితులు అక్కడ పెట్టుకొని నల్లగొండ నుంచి పాదయాత్ర చేయడం డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమేనని వారంటున్నారు.

పర్యటనపై రైతుల్లో అసంతృప్తి

సీఎం పర్యటిస్తున్న మూసీ ప్రాంతంలోని రైతులు గురువారం పర్యటనపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేస్తున్నారు. 'ముఖ్యమంత్రీ నువు రాకున్నా ఫర్వాలేదు.. కానీ, రుణమాఫీ చెయ్యి' అంటూ పలుచోట్ల ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో రైతాంగం, మూసీ బాధితులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు కలిసి సీఎం ప్రయాణానికి అడ్డంపడి నిరసన తెలిపే అవకాశం ఉన్నదని ఇంటెలిజెన్స్ నివేదిక అందడంతో పోలీస్ అధికారులు, కాంగ్రెస్ నేతలు జాగ్రత్తపడ్డారని తెలుస్తున్నది. సీఎం పాదయాత్ర సాగే మార్గంలో అనుమానిత రైతులను, రైతు సంఘాల, బీఆర్‌ఎస్ నేతలను అదుపులోకి తీసుకుంటున్నారు.

కాళేశ్వరంపై కక్షతో పైలాన్ ఆవిష్కరణ రద్దు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కాళేశ్వరం ప్రాజెక్టు మీద ఎంత కసి, కోపం ఉన్నదో మరోసారి బట్టబయలైంది. వాస్తవానికి ఇదే పర్యటనలో ముఖ్యమంత్రి మిషన్ భగీరథ పైలాన్‌ను కూడా ఆవిష్కరించాల్సి ఉన్నది. ఇది యాదాద్రి భువనగిరి జిల్లాలో భాగంగా 550 గ్రామాలకు మంచినీటిని అందించే పథకం. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే దీనికి అన్ని అనుమతులు ఇచ్చారు. సిద్దిపేట జిల్లా మల్లన్నసాగర్ నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని తరలించి యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజల దాహార్తిని తీర్చే పథకం ఇది. మల్లన్నసాగర్‌కు కాళేశ్వరం నుంచి నీళ్లు వస్తున్నాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై అక్కసు పెంచుకున్నది. మళ్లీ ఇక్కడి నుంచి నీళ్లు తీసుకొచ్చి గ్రామాలకు తాగునీటిని అందిస్తే ప్రజల్లో కాళేశ్వరం ప్రాజెక్టు మీద సానుకూల ప్రభావం, కేసీఆర్ పట్ల ఆరాధనా భావం ఏర్పడుతుందనే ఆలోచనతో ముఖ్యమంత్రి ఆఖరి నిమిషంలో పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు.

మూసీ పునరుజ్జీవ సంకల్ప యాత్ర షెడ్యూల్

- ఉదయం 9 గంటలకు బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యాదగిరిగుట్టకు బయలుదేరుతారు.
- 10 గంటలకు లక్ష్మీ నరసింహస్వామి దర్శనం, పూజ
- 11.30కు యాదగిరిగుట్ట దేవస్థాన అభివృద్ధి అథారిటీ, ఆలయ కార్యకలాపాలపై సీఎం సమీక్ష
- 1.30కు రోడ్డు మార్గంలో సంగెం, అక్కడి నుంచి మూసీ నది పునరుజ్జీవన సంకల్ప యాత్ర
- మూసీ నది కుడి ఒడ్డున భీమలింగం వరకు దాదాపు 2.5 కిలోమీటర్ల పాదయాత్ర. అక్కడి నుంచి తిరిగి ధర్మారెడ్డిపల్లి కాలువ కట్ట వెంబడి నాగిరెడ్డిపల్లి రోడ్డు వరకు పాదయాత్ర. అక్కడే యాత్రను ఉద్దేశించి మూసీ పునరుజ్జీవ సంకల్ప రథంపై నుంచి ముఖ్యమంత్రి ప్రసంగం. అనంతరం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం

సమావేశంలో అభివాదం చేస్తున్న యాదవ నాయకులు

మంత్రి పదవుల్లేవు.. కార్పొరేషన్ చైర్మన్లూ ఇవ్వరా?

- యాదవులను మోసగించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- 20 రోజుల్లో లెక్కలు తేల్చకుంటే ఆమరణ దీక్ష చేస్తాం
- వైహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు రాములుయాదవ్

ఖైరతాబాద్, నవంబర్ 7 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే యాదవుల సంక్షేమానికి పాటుపడుతామని హామీ ఇచ్చి విస్మరించిన సీఎం రేవంత్‌రెడ్డి తమను మోసగించారని యాదవ హక్కుల పోరాట సమితి (వైహెచ్‌పీఎస్) జాతీయ అధ్యక్షుడు మేకల రాములుయాదవ్ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో యాదవులకు మంత్రి పదవితోపాటు సముచిత స్థానం కల్పించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి సంవత్సరం కావస్తున్నా.. ఇప్పటి వరకు యాదవులకు ఎలాంటి ప్రాధాన్యత కల్పించలేదని విమర్శించారు. ఇటీవల ప్రకటించిన 31 కార్పొరేషన్లలో యాదవులకు ఒక్కటి కూడా కేటాయించకపోవడం దారుణమని పేర్కొన్నారు. యాదవులకు మంత్రి పదవి, మూడు ఎమ్మెల్సీలు, ఐదు నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని, 20 రోజుల్లో తమకు తగిన ప్రాధాన్యం కల్పించకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు శెట్టి వంశీమోహన్ యాదవ్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వెంకట్రాం నర్సయ్య, గంగుల ఐలేశ్‌యాదవ్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

రాష్ట్రంలో జీతాలిచ్చే పరిస్థితి లేదు : కిషన్‌రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఎన్నికల హామీలను అమలుచేయలేక పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో జీతాలిచ్చే పరిస్థితి కూడా లేదని, అప్పులు సైతం పుట్టడం లేదని పేర్కొన్నారు. గురువారం సికింద్రాబాద్‌లో నిర్వహించిన 'సంస్థాగత ఎన్నికల పర్వం-2024'లో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలకు చుక్కలు చూపెడుతుందని మండిపడ్డారు. రేషన్ కార్డులు, రూ.4 వేల పింఛన్ ఇవ్వలేదని, గృహ నిర్మాణాలకు భూమిపూజ చేయలేదని పేర్కొన్నారు. ధాన్యానికి సంబంధించి చివరి గింజ వరకూ కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయినా రాష్ట్ర ప్రభుత్వం మధ్యవర్తులు, మిల్లర్లతో కుమ్మక్కై రైతులకు అన్యాయం చేస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు బీజేపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాతీయ సంస్థాగత ఎన్నికల అధికారి కే లక్ష్మణ్, రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి చంద్ర శేఖర్, ఎంపీ డీకే అరుణ తదితరులు పాల్గొన్నారు.